సాక్షి

డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

శుక్రవారం । 2 । మే । 2025



పారిశ్రామిక శిక్షణ.. ఉపాధికి నిచ్చెన

పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా విద్యార్థుల్ని తీర్చిదిద్దాల్సిన అవసరం ఉంది. తద్వారా ఉపాధి, ఉద్యోగ అవకాశాలకు మార్గం సుగమమవుతుంది.


8లో



అటు కళ్యాణ శోభ... ఇటు బ్రహ్మోత్సవ ప్రభ

నిత్య కళ్యాణ కాంతుడైన భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామికి అయిదు రోజుల పాటు సాగే బ్రహ్మోత్సవాలు బ్రహ్మానందాన్ని ఇవ్వనున్నాయి.

సముద్రంలోకి 1,945 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి 1,945 క్యూసెక్కుల గోదావరి మిగులు జలాలను గురువారం సముద్రంలోకి విడిచిపెట్టారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 8.70 అడుగులుగా నమోదైంది. డెల్టా కాలువలకు నీటిని విడుదల చేయలేదు.

కొలువులు ఖాళీ

- ఒత్తిడితో స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ డీఐజీ మృతి
- ఇన్‌చార్జి డీఐజీ ఉద్యోగ విరమణ
- అవినీతి కేసులో డీఆర్ అరెస్టు
- ఇన్‌చార్జిగా ఆడిట్ అధికారి
- కోనసీమ ఇన్‌చార్జిగా రాజమహేంద్రవరం డీఆర్



కాకినాడ ఇన్‌చార్జి డీఆర్‌గా జయలక్ష్మి



కోనసీమ ఇన్‌చార్జి డీఆర్‌గా రెడ్డి సత్యనారాయణ

సాక్షి ప్రతినిధి, కాకినాడ: ఆదాయం దండిగా రావాలంటూ భారీ టార్గెట్లతో ఒత్తిడి పెంచుతున్నారు. పని చేయడానికి సరిపడా అధికారులను మాత్రం నియమించడం లేదు. ఉన్న వారితో సర్దుకుపోవాలని చెబుతున్నారు. పని ఒత్తిడి పెరిగి చావు కళ్ల చూస్తున్నా కూటమి ప్రభుత్వానికి చీమ కుట్టినట్టయినా లేదు. ఈ వింత పరిస్థితికి కేరాఫ్‌గా కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం నిలుస్తోంది. ఇప్పటికే పని భారం, ఒత్తిళ్లతో ఇటీవల ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ శివరాం గుండెపోటుతో హఠాన్మరణం చెందారు. ఈ సంఘటన కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు, ఉద్యోగులలో గుబులు రేపుతోంది. అప్పటి నుంచి జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో అధికారులు అసహనం, ఆందోళనతో పని చేస్తున్నారు.

ఇన్‌చార్జిలతో సరి..

- జిల్లా స్థాయిలో కీలక పోస్టులు ఖాళీ అయ్యాయి. వీటన్నింటిలో ప్రభుత్వం ఇన్‌చార్జిలను మాత్రమే నియమిస్తోంది.
- ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖ డీఐజీ శివరాం మృతితో ఖాళీ అయిన పోస్టును ప్రభుత్వం ఇప్పటి వరకూ భర్తీ చేయలేదు. ఆయన స్థానంలో పశ్చిమ గోదావరి జిల్లా రిజిస్ట్రార్ లంక వెంకటేశ్వరరావును ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఇన్‌చార్జి డీఐజీగా నియమించారు. ఆయన కూడా ఏప్రిల్ 30న ఉద్యోగ విరమణ చేశారు. దీంతో ఆ పోస్టు మరోసారి ఖాళీ అయ్యింది. రెండోసారి ఇన్‌చార్జి డీఐజీగా ఏలూరు డీఐజీ మాధవిని ప్రభుత్వం నియమించింది.
- కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ (డీఆర్) పరిస్థితి కూడా అంతే. కాకినాడ జిల్లా డీఆర్ కె.ఆనందరావును అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు అరెస్టు చేశారు. దీంతో, ఆయన ఉద్వాసనకు గురయ్యారు. ఆయన స్థానంలో కాకినాడ జిల్లా ఇన్‌చార్జి డీఆర్‌గా జయలక్ష్మిని నియమించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని 36 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పర్యవేక్షణ బాధ్యతలను జయలక్ష్మి చూస్తుంటారు. కాకినాడతో పాటు తూర్పు గోదావరి, కోనసీమ జిల్లాల రిజిస్ట్రార్ల పరిధిలో ఉండే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు వెళ్లి, డాక్యుమెంటేషన్, పని తీరును ఆమె సమీక్షించాల్సి ఉంటుంది. ఉమ్మడి జిల్లాలో ఏడాదికి లక్షా 50 వేల రిజిస్ట్రేషన్లు జరిగితే వాటిలో తక్కువగా రిజిస్ట్రేషన్ ఫీజు వసూలు చేసే కేసులపై ఆడిట్ నిర్వహించి, ఆ మేరకు ఫీజు వసూలు చేస్తుంటారు. ఇన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల బాధ్యతలు నిర్వర్తించే జయలక్ష్మికి కాకినాడ డీఆర్‌గా ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించడం గమనార్హం.
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రిజిస్ట్రార్ నాగలింగేశ్వరరావును రాష్ట్ర ఐజీ కార్యాలయానికి పంపించారు. ఆయన స్థానంలో రాజమహేంద్రవరం జిల్లా రిజిస్ట్రార్ రెడ్డి సత్యనారాయణను ఇన్‌చార్జిగా నియమించారు.
- ఇలా కాకినాడ, కోనసీమ జిల్లా డీఆర్‌లు, ఉమ్మడి తూర్పు గోదావరి డీఐజీ వంటి కీలకమైన పోస్టులు ఇన్‌చార్జిలతోనే నడుస్తుండటంతో తీవ్ర పని ఒత్తిడికి గురవుతున్నారు.

స్లాట్ విధానంతో..

ఈ పరిణామాలకు తోడు ప్రభుత్వం తీసుకు వచ్చిన స్లాట్ విధానం మరింత భారంగా మారింది. ఈ విధానంలో రిజిస్ట్రేషన్లకు తరచూ సాంకేతిక ప్రతిబంధకాలు ఎదురవుతున్నాయి. ఫలితంగా రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీటన్నింటినీ జిల్లా రిజిస్ట్రార్లు చక్కదిద్దలేకపోతున్నారు. దీంతో, మిగిలిన పనులు ముందుకు సాగక రిజిస్ట్రేషన్లు మందగిస్తున్నాయి. జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో సొసైటీ రెన్యువల్, విదేశాల్లో ఉన్నవారు తమ బంధువులకు జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ (జీపీఏ) ఇచ్చే సమయంలో చేసే వేల్యుయేషన్, సొసైటీ రిజిస్ట్రేషన్లు, ఒక ఆస్తికి సంబంధించి ఈసీలో తప్పులుంటే సరి చేయడం వంటి వాటిని డీఆర్ మాత్రమే చేయాలి. వీటికి తోడు చిట్‌ఫండ్ కేసులు, క్రిస్టియన్ వివాహ వ్యవహారాలు కూడా జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలోనే నిర్వహించాల్సి ఉంది. అయితే, ఇన్‌చార్జి బాధ్యతలతో డీఆర్‌లు అందుబాటులో లేక ఇవన్నీ ఆలస్యంగా జరుగుతున్నాయి. దీంతో, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కీలకమైన ఈ పోస్టుల్లో అధికారులందరూ పూర్తి స్థాయిలో ఉన్నప్పుడు కాకినాడ జాయింట్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రోజుకు 60 నుంచి 70 దస్తావేజుల రిజిస్ట్రేషన్లు జరుగుతూండేవి. ఇన్‌చార్జిలు, అదనపు బాధ్యతల కారణంగా ప్రస్తుతం ఈ రిజిస్ట్రేషన్ల సంఖ్య 30 నుంచి 40 డాక్యుమెంట్లకు పడిపోయింది.

పని ఒత్తిడితో సతమతం

రిజిస్ట్రేషన్లతో వచ్చే ఆమ్యామ్యాల మాటేమో కానీ పని ఒత్తిడి అధిగమిస్తే చాలనుకునే పరిస్థితికి వచ్చేశారు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాల్లోని సిబ్బంది. ఈ కార్యాలయాల్లో పని చేయాల్సిన పది మంది భారం కొందరి పైనే పడుతోంది. కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో కీలకమైన పోస్టులు ఖాళీగా ఉండటం, ఇన్‌చార్జిలతోనే ప్రభుత్వం సరిపెట్టడంతో పని ఒత్తిడి పెరిగి, అధికారులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. ఈ పరిస్థితుల్లో రిజిస్ట్రేషన్లు మందగించడంతో ప్రభుత్వం ఆశిస్తున్న ఆర్థిక లక్ష్యాలు సాధించడం సాధ్యం కావడం లేదు. కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో కొలువంటే అధికారులు, ఉద్యోగులు హడలెత్తిపోతున్నారు.



నేడు రిజిస్ట్రేషన్లు మందగించడంతో వెలవెలబోతోందిలా..



ఒకప్పుడు క్రయవిక్రయదారులతో కిటకిటలాడిన కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

భారం మోపడం తగదు



అధికారులపై ఇంతలా భారం మోపడం సహేతుకం కాదు. మూడు జిల్లాలను పర్యవేక్షించే డీఐజీ స్థాయి అధికారులకు జిల్లాల రిజిస్ట్రార్ల బాధ్యతలు అప్పగించడంతో కార్యాలయాల్లో పనులు మందగిస్తున్నాయి. రిజిస్ట్రేషన్లు కూడా రోజురోజుకూ తగ్గిపోతున్నాయి. నెలల తరబడి ఇన్‌చార్జిలతో కొనసాగించడం వల్ల రిజిస్ట్రేషన్లకు వచ్చే భూముల యజమానులు కూడా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం త్వరగా పూర్తి స్థాయిలో అధికారులను నియమించాలి.

– చోడపునీడి గోవిందరావు, దస్తావేజు లేఖర్ల సంఘం అధ్యక్షుడు, కాకినాడ

పోస్టులు భర్తీ చేయాలి



జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయాన్ని ఇన్‌చార్జిలతో నడిపిస్తుండటంతో వారిపై అదనపు భారం పడుతోంది. జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో ఒకటి రెండు రోజుల్లో అయ్యే పనులు వారం నుంచి నెల వరకూ జరగడం లేదు. దీనివల్ల కొన్ని రిజిస్ట్రేషన్లు ఆగిపోయి, ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. వెంటనే రిజిస్ట్రేషన్లు జరగకపోవడంతో క్రయవిక్రయదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఇన్‌చార్జి అధికారులతో జిల్లా స్థాయి పోస్టులు నిర్వహిస్తుండటంతో ఇలా జరుగుతోందని సిబ్బంది చెబుతున్నారు.

– జీఎస్ఆర్ కృష్ణారావు, కాకినాడ

న్యూస్‌రీల్

విమానాశ్రయం కాదు.. రైల్వే లైన్ సంగతి చూడండి

వైఎస్సార్ సీపీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రాజా

అమలాపురం టౌన్: కోనసీమకు త్వరలో విమానాశ్రయం కూడా రానున్నదని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు చెప్పడం హాస్యాస్పదంగా ఉందని వైఎస్సార్ సీపీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు తోరం గౌతమ్‌రాజా గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. కోనసీమకు ఇప్పుడు కావాల్సింది విమానాశ్రయం కాదని, ఏళ్ల తరబడి నత్తనడక నడుస్తున్న కోనసీమ రైల్వే లైన్ నిర్మాణం అత్యవసరంగా పూర్తి చేయడమని స్పష్టం చేశారు. రైల్వే లైన్‌కు అవసరమైన భూసేకరణలో నెలకొన్న అడ్డంకులను తొలగించేలా ఎంపీ, ఎమ్మెల్యేలు చర్యలు తీసుకోవాలని సూచించారు. రైల్వే లైన్ ఎప్పటి నుంచి అందుబాటులోకి వస్తుందో చెప్పకుండా అదిగో ఇదిగో అంటూ విమానాశ్రయం గురించి మాట్లాడడం అసందర్భంగా ఉందని పేర్కొన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో కోనసీమకు ప్రభుత్వ వైద్య కళాశాలను మంజూరు చేసి, దాదాపు 30 శాతం పనులు పూర్తి చేసిందని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ కళాశాల పనులను నిలిపేసిందన్నారు. ప్రజలకు ఉపయోగపడే ప్రాజెక్టులను పూర్తి చేయడంపై ఎమ్మెల్యే దృష్టి పెట్టాలని గౌతమ్‌రాజా విజ్ఞప్తి చేశారు.

అంతర్జాతీయ బ్యాడ్మింటన్ జోడీకి అభినందనలు

అమలాపురం టౌన్: అంతర్జాతీయ బ్యాడ్మింటన్ జోడీ సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి అత్యుత్తమ క్రీడా పురస్కారం మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్ రత్న అవార్డు అందుకోవడం పట్ల కోనసీమకు చెందిన పలువురు అభినందించారు. కేంద్ర క్రీడా శాఖ మంత్రి చేతుల మీదుగా వారు ఢిల్లీలో గురువారం అవార్డు అందుకోవడంపై కోనసీమ షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లాడ శరత్‌బాబు, కార్యదర్శి తిక్కిరెడ్డి సురేష్ హర్షం వ్యక్తం చేశారు. అమలాపురానికి చెందిన సాత్విక్ ధ్యాన్‌చంద్ అవార్డుకు ఎంపికైనప్పుడు ఆయన తండ్రి రంకిరెడ్డి కాశీ విశ్వనాథ్ ఎంతో సంతోషించారు. కాశీ విశ్వనాథ్ ఇటీవల మృతి చెందడంతో ఈ అవార్డు స్వీకరణలో కొంత జాప్యం అనివార్యమైంది. సాత్విక్ తన తల్లి రంగమణితో కలిసి వెళ్లి అవార్డు అందుకున్నారని శరత్‌బాబు తెలిపారు.

బాలికల భవితకు కిశోరి వికాసం

కాకినాడ సిటీ: బాలికల రక్షణ, వారి అభివృద్ధి కిశోరి వికాసం కార్యక్రమ ముఖ్య లక్ష్యాలని కలెక్టర్ షణ్మోహన్ సగిలి అన్నారు. ఈ కార్యక్రమం పోస్టర్‌ను కలెక్టరేట్‌లో గురువారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ కార్యక్రమం కింద జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యాన వార్డు, గ్రామ సచివాలయాల్లో ఈ నెల 2 నుంచి వచ్చే నెల 10వ తేదీ వరకూ బాలికలకు 12 అంశాలపై అవగాహన కల్పించనున్నారని చెప్పారు. 11 నుంచి 18 సంవత్సరాల లోపు బాలికలను, డ్రాపౌట్లను గుర్తించి, గ్రూపులుగా తయారు చేసి, శిక్షణ ఇవ్వనున్నారన్నారు. రుతుక్రమ పరిశుభ్రత, నిర్వహణ, లైంగిక విద్య, బాల్యవివాహం, పునరుత్పత్తి, ఆరోగ్యం, బాలల హక్కులు, రక్షణ, పోక్సో చట్టం, కౌమార దశలో ఐరన్ లోపం, రక్తహీనత, లింగ అసమానత, విద్య, కెరీర్, మార్గదర్శకత్వం, నైపుణ్యాల ప్రాధాన్యం, సైబర్ మోసాలు, ఆన్‌లైన్ భద్రత, సమస్యలు, ఆర్థిక నిర్వహణ, కౌమార బాలికల నాయకత్వం, సాధికారిత తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి వరకు కమిటీలు ఏర్పాటు చేశామని వివరించారు.

కేఎస్‌పీఎల్ భూములకు పరిహారం పెంచాలి




రైతులతో చర్చిస్తున్న జేసీ రాహుల్ మీనా

తొండంగి: కాకినాడ సీపోర్టు లిమిటెడ్(కేఎస్‌పీఎల్)కు తొండంగి మండలం పెరుమాళ్లపురంలో ప్రభుత్వం సేకరించిన భూములకు పరిహారాన్ని మరింత పెంచాలని రైతులు కోరారు. ఈ భూముల పరిహారంపై రైతులతో తొండంగి తహసీల్దార్ కార్యాలయంలో జేసీ రాహుల్ మీనా చర్చించారు. మొత్తం సుమారు 597 ఎకరాల భూములకు సంబంధించి ప్రభుత్వం ఎకరాకు రూ.10 లక్షలు ప్రకటించిందని తహసీల్దార్ మురార్జీ వివరించారు. ఈ మొత్తానికి అంగీకరించని 781 మంది రైతులు పరిహారం తీసుకోలేదు. ఈ భూములకు మార్కెట్లో ఎక్కువ ధర ఉందని, రెట్టింపు పరిహారం ఇవ్వాలని 52 మంది రైతులు డిమాండ్ చేశారు. దీనిపై ఉన్నతాధికారులతో మాట్లాడి, రైతులకు న్యాయం చేసేందుకు కృషి చేస్తామని జేసీ హామీ ఇచ్చారు.

మోదీది విభజించి, పాలించు విధానం

- కగార్ పేరుతో గిరిజనుల జీవితాలు నాశనం చేయొద్దు
- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ డిమాండ్



సాక్షి, రాజమహేంద్రవరం/రాజమహేంద్రవరం సిటీ: ప్రధాని నరేంద్ర మోదీ రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్నారని, కులాలు, మతాల పేరుతో దేశాన్ని విభజించి పాలిస్తున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ విమర్శించారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సింహాచలం ఘటన దురదృష్టకరమని, దీనిపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ అమరావతి సభ కోసం రాష్ట్రానికి మహారాజు వస్తున్నట్టుగా చంద్రబాబు హడావుడి చేస్తున్నారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు నాయుడు 2014లో ముఖ్యమంత్రి అయినప్పుడు ప్రధాని రాష్ట్రానికి ఎలాంటి నిధులూ ఇవ్వలేదని, అమరావతి ప్రారంభానికి వచ్చినప్పుడు చెంబుడు నీళ్లు, గుప్పెడు మట్టి తీసుకొచ్చి రాష్ట్ర ప్రజలను అవమానించారని అన్నారు. అందుకే తరువాతి ఎన్నికల్లో చంద్రబాబు ఓడిపోయారని చెప్పారు. ప్రధాని పర్యటన సందర్భంగా తాము నిరసన తెలుపుతామని ప్రకటించారు.

మోదీకి ఎన్నికల మీద ఉన్న ప్రేమ దేశ భద్రతపై లేదని నారాయణ విమర్శించారు. పహల్గాం ఘటన జరిగిన తర్వాత అఖిలపక్షం ఏర్పాటు చేసిన ఆయన.. ఆ సమావేశానికి రాకుండా బిహార్ ఎన్నికల ప్రచారానికి వెళ్లడం తీవ్రమైన తప్పిదమని దుయ్యబట్టారు. ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టుల ఏరివేత దారుణమని, ఆ పేరుతో అమాయక గిరిజనులను చంపుతున్నారని అన్నారు. అక్కడి సహజ వనరులను, గనులను అదానీకి అప్పగించేందుకే కగార్ డ్రామా ఆడుతున్నారని నారాయణ విమర్శించారు. కేంద్ర హోం మంత్రి అమిత్‌షా టైం ప్రకటించి మరీ మావోయిస్టులను చంపడమే లక్ష్యంగా పెట్టుకున్నారని అన్నారు. దేశ రక్షణ కంటే మావోయిస్టుల నిర్మూలన పైనే మంత్రి దృష్టి పెట్టారని, అందుకే పహల్గాం ఘటన జరిగిందన్నారు. ఈ ఘటన తర్వాత దేశంలోని అన్ని రాజకీయ పార్టీలూ తొలిసారి ప్రధాని మోదీకి అండగా నిలిచాయని, కానీ ఈ ఘటనను బీహార్, యూపీ ఎన్నికల్లో లబ్ధి కోసం వాడుకోవాలని ప్రధాని మోదీ చూస్తున్నారని ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం కుల గణనకు ఆమోదం తెలపడం మంచి పరిణామమని చెప్పారు. అయితే, నిర్దిష్ట కాలపరిమితితో కులగణనను ప్రకటించకపోవడం కేంద్రం చేస్తున్న మరో మోసమని విమర్శించారు.

దేశంలో కార్మికుల సాధించుకున్న హక్కులను పాలకవర్గాలు కాలరాస్తున్నాయని, ముఖ్యంగా కేంద్రంలో బీజేపీ వచ్చాక కార్మిక హక్కులు హరించుకుపోయాయని, వంద మంది ఉంటేనే సంఘం కట్టే పరిస్థితి నెలకొందని నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీని ఎదుర్కోవాలంటే దేశంలో ఇండియా కూటమి మరింత బలపడాల్సిన అవసరముందన్నారు. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు గాడిద చాకిరీ చేస్తూ బానిసల్లా బతుకుతున్నారని, వారి హక్కుల కోసం పోరాడాల్సిన దుస్థితి వచ్చిందని అన్నారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ, జిల్లా కార్యదర్శి తాటిపాక మధు పాల్గొన్నారు.

రత్నగిరికి పోటెత్తిన భక్తులు



ఆలయ ప్రాంగణంలో పెళ్లి బృందాల కోలాహలం

అన్నవరం: రత్నగిరికి గురువారం భక్తులు పోటెత్తారు. బుధవారం మధ్యాహ్నం, రాత్రి, గురువారం తెల్లవారుజామున రత్నగిరి పైన, ఇతర ప్రాంతాల్లోను పెద్ద సంఖ్యలో వివాహాలు జరిగాయి. ఆ నవదంపతులు, వారి బంధుమిత్రులతో పాటు ఇతర భక్తులు కూడా తరలి రావడంతో సత్యదేవుని సన్నిధి కిటకిటలాడింది. స్వామివారి ఉచిత దర్శనానికి గంట, ప్రత్యేక దర్శనానికి అరగంట పట్టింది. సత్యదేవుని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షిణ చేసి, రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించారు. స్వామివారిని 40 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. వ్రతాలు రెండు వేలు నిర్వహించారు. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.40 లక్షల ఆదాయం సమకూరింది. నిత్యాన్నదాన పథకంలో సత్యదేవుని అన్న ప్రసాదాన్ని సుమారు 5 వేల మంది భక్తులు స్వీకరించారు. సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారు, పరమేశ్వరుడు భక్తులకు నిజరూప దర్శనం ఇచ్చారు. రత్నగిరి వనదుర్గ అమ్మవారికి శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి చండీహోమం నిర్వహించనున్నారు. ఆసక్తి ఉన్న భక్తులు రూ.750 టికెట్టుతో హోమంలో పాల్గొనవచ్చని అధికారులు తెలిపారు.

మహిళల రక్షణకు వన్ స్టాప్ సెంటర్



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ నిషాంతి

అమలాపురం రూరల్: వేధింపులు, వివక్ష నుంచి మహిళలకు రక్షణ కల్పించేందుకు వన్ స్టాప్ సెంటర్ అన్ని విధాలా ఉపయోగపడుతుందని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి అన్నారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో కలెక్టరేట్‌లో ఇటీవల ఈ సెంటర్ ఏర్పాటు చేశారు. దీని నిర్వహణకు కాంట్రాక్ట్ ప్రాతిపదికన 13 పోస్టులు నింపేందుకు గురువారం ఆమె ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, ఈ సెంటర్‌లో నియమించే సిబ్బంది ప్రధానంగా గృహహింస, పని చేసే ప్రాంతాల్లో మహిళలపై వేధింపులకు సంబంధించిన ఫిర్యాదులు స్వీకరిస్తారని చెప్పారు. కేంద్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యాన ఈ కార్యక్రమం అమలు చేస్తున్నారన్నారు. జిల్లా స్థాయిలో ఐసీడీఎస్ పీడీ, సీడీపీఓ, ఇతర అధికారుల ఆధ్వర్యాన ఈ కార్యక్రమం అమలు చేస్తారన్నారు. ఇంటర్వ్యూల్లో కమిటీ సభ్యులు ఐసీడీఎస్ పీడీ శాంతికుమారి, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ఎం.దుర్గారావుదొర, జిల్లా సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి పి.జ్యోతిలక్ష్మీదేవి, సీడీపీఓలు పాల్గొన్నారు.

మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేయాలి

జిల్లావ్యాప్తంగా రబీలో 5.80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశామని, ఇందులో ప్రభుత్వ పరంగా కొనుగోలుకు నిర్దేశించిన 34 శాతం లక్ష్యం సరిపోలేదని, అందువలన బహిరంగ మార్కెట్‌లో మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేయాలని జేసీ నిషాంతి కోరారు. రైస్ మిల్లర్ల ప్రతినిధులతో కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని పెంచాలని రాష్ట్ర స్థాయి అధికారులకు విన్నవించామని అన్నారు. మిల్లర్ల ప్రతినిధులు కూడా ఈ మేరకు కోరాలని అన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి రాజకుమారి, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ ఎం.బాలసరస్వతి, మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు చొదరి తదితరులు పాల్గొన్నారు.

అడ్మిషన్... అటెన్షన్

- ముందస్తు అడ్మిషన్లతో జాగ్రత్త
- ఆకట్టుకునే ప్రచారాలు నమ్మి మోసపోవద్దు
- పాఠశాలల గురించి తెలుసుకున్నాకే చిన్నారులను చేర్పించాలి
- రిజిస్ట్రేషన్, గుర్తింపుపై ఆరా తీయాలి
- క్వాలిఫైడ్ టీచర్లు ఉన్నారో లేరో పరిశీలించాలి



రాయవరం: ఒక విద్యా సంవత్సరం ముగిసింది. 2025–26 విద్యా సంవత్సరం జూన్ 12 నుంచి ప్రారంభం కానుంది. ఈ విద్యా సంవత్సరం ప్రారంభం కాకుండానే అడ్మిషన్ల కోసం పుట్టగొడుగుల్లా పుట్టుకు వస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు విద్యార్థుల ఇంటి బాట పట్టాయి. ఆయా ప్రాంతాల్లో నూతన బ్రాంచిలు ప్రారంభించేందుకు సిద్ధమయ్యారు. పలు హంగులు, ఆర్భాటాలతో తల్లిదండ్రులను ఆకర్షించేందుకు ప్రచారాలు చేస్తూ ప్రవేశాల ప్రక్రియ చేపడుతున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పాఠశాల ప్రారంభించాలంటే విద్యా శాఖ అనుమతి తీసుకోవాలి. మొదట ఓపెనింగ్ అనుమతి తీసుకున్న తర్వాతే విద్యా సంస్థలను తెరచి విద్యార్థులను చేర్చుకోవాలి. తర్వాత పూర్తి స్థాయి అనుమతి పొందాల్సి ఉంటుంది. ప్రాథమిక స్థాయికి జిల్లా విద్యాశాఖ అధికారి నుంచి, ఉన్నత తరగతులు ప్రారంభించాలంటే పాఠశాల విద్యా శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ (ఆర్‌జేడీ) ద్వారా పాఠశాల విద్యా కమిషనర్ అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. సీబీఎస్ఈ సిలబస్ బోధించేందుకు కేంద్ర విద్యా మండలి అనుమతి కావాలి.

వీటిపై ఆరా తీయండి

ప్రతి విద్యా సంస్థ ప్రభుత్వం నుంచి కచ్చితంగా గుర్తింపు పొంది ఉండాలి. గుర్తింపు పొందిన విద్యా సంస్థల్లోనే తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించాలి. ఎటువంటి అనుమతులూ తీసుకోకుండా కొన్ని పాఠశాలలు ఇతర విద్యా సంస్థల తరఫున పరీక్షలు రాయిస్తుంటాయి. అలా పరీక్ష రాసిన విద్యార్థులను ప్రభుత్వం ప్రైవేటు విద్యార్థులుగా పరిగణిస్తుంది. ఇలాంటి విషయాల్లో జాగ్రత్తలు అవసరం.

ఈ జాగ్రత్తలు మేలు

- పిల్లలను చేర్పించే ముందు ఆ పాఠశాలకు ప్రభుత్వ గుర్తింపు ఉందో లేదో తల్లిదండ్రులు చూసుకోవాలి.
- ప్రభుత్వ ఇంజినీరింగ్ విభాగం జారీ చేసిన పాఠశాల భవనం నాణ్యత ధ్రువీకరణ పత్రాన్ని పరిశీలించాలి.
- విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా టాయిలెట్లు, నీటి సదుపాయం వంటి మౌలిక వసతులున్నాయో లేవో చూడాలి.
- విద్యార్థులు మానసిక, శారీరకోల్లాసానికి ఉపకరించే ఆటస్థలం, వ్యాయామోపాధ్యాయులు ఉన్నారో లేరో ఆరా తీయాలి.
- అర్హత గల ఉపాధ్యాయులు బోధిస్తున్నారా లేదా అనే విషయం తెలుసుకోవాలి.
- ప్రాథమిక, ప్రాథమికోన్నత స్థాయిలో 20 నుంచి 40 మందికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలి. ఉన్నత పాఠశాల అయితే సబ్జెక్టుల వారీగా ఒకరు చొప్పున ఉండాలి.
- విద్యా సంస్థల బస్సులకు రవాణా శాఖ సామర్థ్య పరీక్ష పత్రం జారీ చేస్తుంది. సుశిక్షితులైన డ్రైవర్ తప్పనిసరి.
- జీ+1 భవనాలుంటే అగ్నిమాపక పరికరాలు, ఆ స్థాయి దాటితే మంటలను నియంత్రించే పూర్తి స్థాయి వ్యవస్థ ఉండాలి. సంబంధిత విభాగం నుంచి అనుమతి ఉండాలి.
- ప్రభుత్వ అనుమతి లేని పాఠశాలల్లో విద్యార్థులను చేర్పితే భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తుతాయి. చైల్డ్ ఇన్ఫో ఆధారంగానే విద్యార్థుల ప్రగతి పత్రాలు, టీసీలు జారీ చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ అనుమతి లేని వాటిలో ఈ నమోదు ఉండదు. ఆయా విద్యార్థులను బడి బయట ఉన్న వారిగా పేర్కొంటారు.

ఫిర్యాదు చేయవచ్చు



ప్రైవేటు యాజమాన్యంలో ప్రారంభించే ప్రతి పాఠశాలకూ ప్రభుత్వ గుర్తింపు తప్పనిసరి. ప్రభుత్వ గుర్తింపు లేని పాఠశాలలుంటే జిల్లా విద్యా శాఖ కార్యాలయానికి ఫిర్యాదు చేయవచ్చు. అటువంటి విద్యా సంస్థలపై చర్యలు తీసుకుంటాం. కొత్తగా పాఠశాలలు ప్రారంభిస్తే పూర్తి అనుమతి తీసుకున్న తర్వాత మాత్రమే అడ్మిషన్లు చేపట్టాలి. ప్రభుత్వ గుర్తింపును తల్లిదండ్రులు తప్పనిసరిగా పరిశీలించుకోవాలి.

– డాక్టర్ షేక్ సలీం బాషా, జిల్లా విద్యాశాఖ అధికారి, అమలాపురం

క్లుప్తంగా


ముద్దులొలికే పొట్టిదూడ



కొత్తపేటలో ఆవుతో పుంగనూరు జాతి దూడ

కొత్తపేట: పుంగనూరు జాతి ఆవుకు దూడ జన్మించడంతో ఆ రైతు కుటుంబం ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. పొట్టిగా ముద్దులొలికే పొట్టి దూడ ఆ పెరట్లోనే కాకుండా వారి ఇంట్లో చెంగు చెంగుమని తిరుగుతుంటే ఆ ఇంట్లో వారి ఆనందం అంతా ఇంతా కాదు. కొత్తపేట గ్రామ దేవత బంగారమ్మ తల్లి గుడి ప్రాంతానికి చెందిన రైతు అద్దంకి చంటిబాబుకు ఒంగోలు జాతికి చెందిన ఆవు ఉండేది. దానికి పుంగనూరు జాతి బ్రీడు క్రాసింగ్ చేయించగా అప్పట్లో పుంగనూరు జాతి దూడే పుట్టింది కానీ ఒంగోలు జాతిని పోలి ఉంది. ఆ ఆవు పెద్దదయ్యాక దానికి తొలిచూరిగా పుంగనూరు బ్రీడు క్రాసింగ్ చేయించారు. నెలలు నిండాక పుంగనూరు దూడ పొట్టిగా (అడుగున్నర ఎత్తు) పెయ్య దూడ పుట్టింది. తెలుపు, కపిలవర్ణ రంగులో విశేషంగా ఆకర్షిస్తోంది.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్



కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	14,000 - 14,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 - 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	22,000
గటగట (వెయ్యి)	18,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	20,000
గటగట (వెయ్యి)	17,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 - 13,500
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	13,000 - 13,500
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

పారిశ్రామిక శిక్షణ.. ఉపాధికి నిచ్చెన

- ఐటీఐ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల
- 10వ తరగతి అర్హతతో ప్రవేశాలు
- వివిధ ట్రేడుల్లో అడ్మిషన్లకు ఈ నెల 24 తుది గడువు



కాకినాడలోని ప్రభుత్వ ఐటీఐ



ఐటీఐలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు (ఫైల్)

రాయవరం/బాలాజీచెరువు (కాకినాడ సిటీ): పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా విద్యార్థుల్ని తీర్చిదిద్దాల్సిన అవసరం ఉంది. తద్వారా ఉపాధి, ఉద్యోగ అవకాశాలకు మార్గం సుగమమవుతుంది. ఇదే ఉద్దేశంతో సాంకేతిక విద్యాశాఖ, పారిశ్రామిక శిక్షణ సంస్థ(ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్)లు ఏర్పాటయ్యాయి. ఐటీఐ కోర్సు పూర్తి కాగానే విద్యార్థులు అప్రెంటిస్ చేస్తున్నారు. ప్రతిభతో అవకాశాలు దక్కించుకుంటున్నారు. ప్రస్తుతం ఐటీఐ కళాశాలల్లో వివిధ ట్రేడుల్లో అడ్మిషన్లకు ఈ నెల 24 తుది గడువుగా నిర్ణయించారు. దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైన నేపథ్యంలో ఐటీఐలు, వాటిలో ఉన్న సీట్లు, ట్రేడ్స్ తదితర విషయాలతో 'సాక్షి' కథనం.

అధిక శాతం ఇంటర్‌లో..

పదో తరగతి పూర్తి కాగానే విద్యార్థులు ఏ కోర్సులో చేరాలా అంటూ ఆలోచన చేస్తారు. అధిక శాతం మంది ఇంటర్మీడియెట్‌లో చేరుతారు. సాంకేతిక విద్య ద్వారా త్వరగా జీవితంలో సెటిల్ అవ్వాలనుకునే వారు పాలిటెక్నిక్, ఐటీఐ కోర్సులకు ప్రాధాన్యమిస్తారు. పదవ తరగతి పూర్తి చేయగానే త్వరితగతిన ఉపాధి పొందేందుకు ఐటీఐలు ఒక చక్కని బాటను ఏర్పాటు చేస్తాయని సాంకేతిక నిపుణులు చెబుతారు. సాంకేతిక కోర్సుల్లో ఇంటర్ ఒకేషనల్, పాలిటెక్నిక్ కోర్సులతో పాటు పలువురు విద్యార్థులు ఐటీఐకి ప్రాధాన్యమిస్తున్నారు.

18 ఏళ్లు దాటగానే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు

ఐటీఐ పూర్తిచేసిన తర్వాత విద్యార్థులు అప్రెంటిస్ పూర్తి చేసుకుంటే 18 ఏళ్లు దాటగానే పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాలు పొందడానికి అవకాశం ఉంటుంది. విద్యుత్, రైల్వే, రక్షణ, పలు ప్రభుత్వ, ప్రముఖ ప్రైవేట్ సంస్థల్లో ఐటీఐ పూర్తిచేసిన వారికి ఉద్యోగావకాశాలు లభిస్తాయి. అయితే స్కిల్స్ తప్పనిసరిగా ఉండాలి. ఆయా ట్రేడుల్లో నైపుణ్యం సంపాదించిన విద్యార్థులకు ఉపాధి తప్పనిసరిగా లభిస్తుందనడంలో సందేహం లేదు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి శిక్షణ సంస్థ ఐటీఐల్లో స్కిల్ హబ్స్ ఏర్పాటు చేసి విద్యార్థులకు శిక్షణ ఇస్తోంది. ఉద్యోగం, ఉపాధితో పాటు స్వయం ఉపాధికి సైతం ఐటీఐ దోహదపడుతుంది.

పరిస్థితి ఇదీ..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ప్రభుత్వ ఐటీఐలు లేవు. కాకినాడ జిల్లాలో మాత్రమే రెండు ఉన్నాయి. కోనసీమ జిల్లాలో ప్రైవేటు యాజమాన్యంలో 15 ఐటీఐలు ఉండగా, వీటిలో ఏడాది, రెండేళ్ల కాల పరిమితితో 2,564 సీట్లు ఉన్నాయి. కాకినాడ జిల్లాలో 12 ప్రైవేట్ యాజమాన్యంలో 1,704 సీట్లు ఉన్నాయి. కాకినాడ జిల్లాలోని ప్రభుత్వ ఐటీఐలలో 728 సీట్లు ఉన్నాయి. కాకినాడ, కోనసీమ జిల్లాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీ ఐల్లో ప్రవేశం పొందే విద్యార్థులకు 4,998 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

ఏడాది, రెండేళ్ల వ్యవధితో రెగ్యులర్ కోర్సులు

ఐటీఐల్లో ఏడాది, రెండేళ్ల కాలపరిమితికి రెగ్యులర్ కోర్సులు ఉంటాయి. రెండేళ్ల కాలపరిమితితో ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, ఎలక్ట్రానిక్, మెకానికల్, డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్, ఇనుస్ట్రుమెంటేషన్ మెకానికల్ వంటి కోర్సులు ఉంటాయి. ఏడాది కాలపరిమితితో డీజిల్ మెకానిక్, వెల్డర్, కటింగ్ అండ్ సూయింగ్, కంప్యూటర్ ప్రోగ్రామ్ అసిస్టెంట్ కోర్సులు ఉంటాయి. ఐటీఐల్లో చేరగోరే విద్యార్థులు వారికి ఆసక్తి ఉన్న కోర్సులు ఏ ఏ ఐటీఐల్లో ఉన్నాయో వెళ్లి పరిశీలించుకోవాలి. దరఖాస్తుల పరిశీలన పూర్తయిన విద్యార్థులు మాత్రమే కౌన్సెలింగ్‌కు అర్హత సాధిస్తారు. అడ్మిషన్ల ప్రక్రియ పూర్తయిన వెంటనే తరగతుల ప్రవేశానికి షెడ్యూల్ విడుదల చేస్తారు.

రెండేళ్ల కాల పరిమితి కోర్సులు

ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, డ్రాఫ్ట్స్ మెన్ సివిల్, ఆర్అండ్సి టెక్నాలజీ, మెకానికల్ మోటార్ వెహికల్, ఎలక్ట్రానిక్ మెకానిక్, ఇనుస్ట్రుమెంట్ మెకానిక్, టర్నర్

ఏడాది కాల పరిమితి కోర్సులు

మెకానిక్ డీజిల్, సీవోపీఏ, వెల్డర్, సూయింగ్ టెక్నాలజీ, పీపీవో

డ్రోన్ టెక్నాలజీపై స్వల్పకాలిక కోర్సు

గతేడాది కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో డ్రోన్ టెక్నాలజీపై ఆరు నెలల వ్యవధి గల కోర్సును ప్రవేశ పెట్టారు. కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో 20 సీట్లు ఉన్న ఈ కోర్సును ప్రారంభించారు. వ్యవసాయం, సర్వే, షూటింగ్స్ డ్రోన్ టెక్నాలజీ వినియోగం పెరిగిన నేపథ్యంలో ఐటీఐల్లో డ్రోన్ టెక్నాలజీ కోర్సును ప్రవేశ పెట్టారు. అందులో భాగంగా కాకినాడ ప్రభుత్వ ఐటీఐలో ఈ కోర్సుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.

పాలిటెక్నిక్‌లోనూ చేరవచ్చు..

ఐటీఐలో రెండేళ్ల వ్యవధి ఉన్న కోర్సులు పూర్తి చేసిన వారికి పాలిటెక్నిక్‌లోనూ చేరేందుకు అవకాశం ఉంటుంది. ఇందుకు ప్రత్యేకంగా ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. ఐటీఐ పూర్తి చేసినవారికి పాలిటెక్నిక్ రెండో సంవత్సరంలో బ్రిడ్జి కోర్సు ద్వారా ప్రవేశం పొందేందుకు అవకాశం ఉంది. పాలిటెక్నిక్ పూర్తి చేసినవారు బీటెక్‌లో ప్రవేశం పొందవచ్చు. ఈ విధంగా ఏటా పలువురు లేటరల్ ఎంట్రీని పొంది. ఉన్నత విద్యను అభ్యసించి, ఉద్యోగావకాశాలను పొందుతున్నారు.

నూతన సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన



ఐటీఐల్లో ప్రవేశాలకు నిర్ణీత గడువులోగా విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. కోర్సును పూర్తి చేసిన వారికి మంచి అవకాశాలు ఉంటున్నాయి. విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. నూతన సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం. కౌన్సెలింగ్ షెడ్యూల్ వివరాలను దరఖాస్తుదారుల మొబైల్ నంబరుకు పంపిస్తాం. పదో తరగతిలో విద్యార్థి పొందిన మార్కులు, రిజర్వేషన్ రోస్టర్ ప్రకారం అడ్మిషన్స్ ఉంటాయి.

–ఎంవీజీ వర్మ, కాకినాడ, కోనసీమ జిల్లాల ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐ కళాశాలల జిల్లా కన్వీనర్, కాకినాడ

రూ.12.50 లక్షల విలువైన బంగారం స్వాధీనం

ముగ్గురు దొంగల అరెస్టు



దొంగల నుంచి స్వాధీనం చేసుకున్న బంగారు వస్తువులు

మామిడికుదురు: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో పలు దొంగతనాలకు పాల్పడిన ముగ్గురు దొంగల ముఠాను నగరం పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.12.50 లక్షల విలువైన 133 గ్రాముల బంగారం, మోటార్ సైకిల్ స్వాధీనం చేసుకున్నారు. నగరం పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పి.గన్నవరం సీఐ రుద్రరాజు భీమరాజు, నగరం ఎస్సై ఎ.చైతన్యకుమార్ ఈ చోరీలకు సంబంధించిన వివరాలను తెలిపారు. ఆలమూరు మండలం ఇంద్రిగోపేటకు చెందిన వాసంశెట్టి వీరబాబు, గువ్వల చంద్రశేఖర్, పెదపళ్లకు చెందిన కుడుపూడి నాగరాజులను అరెస్టు చేశామన్నారు. ఈ చోరీ కేసుల్లో మరో నిందితుడు గుత్తుల సుభాష్ పరారీలో ఉన్నాడని చెప్పారు. వీరిపై నగరం, తాడేపల్లిగూడెం, తడికలపూడి, ద్వారకా తిరుమల, దేవరపల్లి, దెందులూరు, పెరవలి, జంగారెడ్డిగూడెం పోలీస్ స్టేషన్లలో పలు దొంగతనం కేసులు నమోదయ్యాయన్నారు. వీరు చైన్ స్నాచింగ్‌లతో పాటు మోటార్ సైకిళ్ల దొంగతనాలకు పాల్పడతారన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురంలో బంగారం అమ్మేందుకు వెళ్తుండగా వీరిపై అనుమానం వచ్చి నగరం ఎస్సై చైతన్యకుమార్ అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా చోరీ నేరాల గుట్టు రట్టు అయ్యిందన్నారు. దొంగలను పట్టుకోవడంతో చాకచక్యంగా పనిచేసిన సీఐలు భీమరాజు, గజేంద్ర (సీసీఎస్), ఎస్సైలు చైతన్యకుమార్, పరదేశి, కానిస్టేబుళ్లు కృష్ణసాయి, శ్రీను, దుర్గాప్రసాద్, అర్జునరావు, సుభాకర్, బ్లెస్సన్‌ను ఎస్పీ కృష్ణారావు అభినందించారు.

ఎనిమిది మందికి కారుణ్య నియామకాలు



కారుణ్య నియామక ఉత్తర్వులు అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు, సీఈవో లక్ష్మణరావు

కాకినాడ సిటీ: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రజాపరిషత్ ఆధ్వర్యంలోని పాఠశాలలు, ఇతర ప్రభుత్వ శాఖల్లో పని చేస్తూ ఆకస్మికంగా చనిపోయిన ఉపాధ్యాయులు, ఉద్యోగుల వారసులకు కారుణ్య నియామకాలను జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు గురువారం నిర్వహించారు. మరణించిన ఉద్యోగుల కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకం కింద ఏడుగురికి జూనియర్ అసిస్టెంట్ పోస్టులను, ఒకరికి ఆఫీసు సబార్డినేట్, చాలాకాలంగా రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఇద్దరిలో ఒక డ్రైవరికి జూనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్ విప్పర్తి మాట్లాడుతూ కార్మికులకు మేడే శుభాకాంక్షలు తెలిపారు. జెడ్పీ సీఈవో వీవీవీఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ఎనిమిది మందికి కారుణ్య నియామకాలు, ముగ్గురికి పదోన్నతులు కల్పించినట్లు తెలిపారు. జీఎస్ రాంగోపాల్, ఏపీ పంచాయతీరాజ్ మంత్రిత్వ సిబ్బంది సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌వీవీ రమేష్, పరిపాలనాధికారి వీహెచ్ ఎస్ఆర్ సుబ్రహ్మణ్యం, పాల్గొన్నారు.

సాగర తీరాన క్రీడా సంబరం

- నేటి నుంచి మూడు రోజులపాటు బీచ్ కబడ్డీ పోటీలు
- రాష్ట్రంలో 13 జిల్లాల నుంచి క్రీడాకారుల రాక
- సీనియర్ మహిళలు, పురుషుల విభాగాల్లో పోటీలు



కాకినాడ సూర్యారావుపేట వద్ద బీచ్ కబడ్డీ పోటీలకు సిద్ధమైన క్రీడా ప్రాంగణం

కాకినాడ రూరల్: కాకినాడ సాగర తీరం క్రీడా సంబరానికి వేదిక అయ్యింది. ఏపీ కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో 12వ రాష్ట్ర స్థాయి సీనియర్ మెన్ అండ్ వుమెన్స్ కబడ్డీ పోటీలు రూరల్ మండలం సూర్యారావుపేట న్యూ ఎన్టీఆర్ బీచ్‌లో శుక్రవారం ప్రారంభం కానున్నాయి. ఫ్లడ్ లైట్ల వెలుతురులో సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి 9.30 గంటల వరకు కబడ్డీ పోటీలు కనువిందు చేయనున్నాయి. ఇందుకు కోసం నాలుగు కోర్టులను ఏర్పాటు చేశారు. లీగ్ కమ్ నాకౌట్ దశలో జరగనున్న కబడ్డీ పోటీలలో ప్రతిభ చూపిన క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కానున్నారు. పోటీలు మూడురోజులు జరుగుతాయి. రోజుకు 15నుంచి సుమారు 20మ్యాచ్‌లు వరకు జరగనున్నాయి. ఒక్కో జట్టులో నలుగురేసి క్రీడాకారులు తలపడనున్నారు. పూర్వపు ఉమ్మడి జిల్లాల ప్రతిపాదికన క్రీడా జట్లు పోటీలలో ప్రాతినిధ్యం వహిస్తుండడంతో 13జిల్లాల నుంచి 13పురుషుల జట్లు, 13మహిళల జట్లు హాజరవుతున్నాయి. పురుషుల జట్లుకు సూర్యారావుపేట జెడ్పీ హైస్కూల్, మహిళలకు వాకలపూడి హైస్కూల్‌లో వసతి, భోజన సదుపాయం కల్పించారు.

చెట్టు కూలి వ్యక్తి మృతి



రవికుమార్ మృతదేహం

కొవ్వూరు: పట్టణంలో వేములూరు–దీప్తీ స్కూలు రోడ్డు మార్గంలో ఈదురు గాలుల ప్రభావానికి చెట్టు కూలి మోటారు సైకిలిస్టుపై పడడంతో వేములూరు గ్రామానికి చెందిన చిన్న రవి కుమార్ (49) మృతిచెందారు. బుధవారం రాత్రి స్నేహితుడు అత్తిలి చంద్రరావుతో కలిసి మోటారుసైకిల్‌పై రాజమహేంద్రవరం వెళ్లి తిరిగి వస్తుండగా మార్గ మధ్యలో బలమైన ఈదురుగాలులు వీచి రవికుమార్ నడుపుతున్న మోటారు సైకిల్‌పై చెట్టు పడింది. బలమైన గాయాలు కావడంతో రవికుమార్ ఘటనా స్థలంలోనే మృతి చెందారు. వెనుక కూర్చొన్న చంద్రరావుకి తీవ్ర గాయాలు కావడంతో రాజమహేంద్రవరంలోని ప్రయివేటు ఆసుపత్రిలో చేర్పించారు. ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ హెడ్ కానిస్టేబుల్ ఆర్ సత్యనారాయణ తెలిపారు. మృతుడు అవంతీ ఫీడ్స్ ఫ్యాక్టరీలో వర్కర్‌గా పనిచేస్తున్నారు. రవి కుమార్‌కి భార్య, కుమారుడు ఉన్నారు.

బెల్ట్‌షాపు నిర్వాహకులపై కేసులు

కాకినాడ క్రైం: కాకినాడ జిల్లా ఎక్సైజ్ పరిధిలో గురువారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో అధికారులు కాకినాడ అర్బన్, ప్రత్తిపాడు, పిఠాపురం, తుని, పెద్దాపురంలో బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్న ఐదుగురిని అదుపులోకి తీసుకొని వారిపై కేసులు నమోదు చేశారు.

అటు కళ్యాణ శోభ... ఇటు బ్రహ్మోత్సవ ప్రభ

- వీరేశ్వరస్వామి ఆలయంలో ఆరంభమైన బ్రహ్మోత్సవాలు
- అయిదు రోజులపాటు అలరించనున్న ఆధ్యాత్మిక సంబరాలు



భద్రకాళీ సమేత వీరేశ్వరునికి పంచామృత అభిషేకం



వీరేశ్వరస్వామి ఆలయంలో కల్యాణ మహోత్సవం



కల్యాణకాంతులతో స్వామి అమ్మవార్లు

ఐ.పోలవరం: నిత్య కళ్యాణ కాంతుడైన భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామికి అయిదు రోజుల పాటు సాగే బ్రహ్మోత్సవాలు బ్రహ్మానందాన్ని ఇవ్వనున్నాయి. తమ గోత్ర నామాలతో స్వామి ముందు కూర్చుని కల్యాణాలు చేయించుకుంటూ ధన్యమయ్యే భక్తులు మురమళ్ల పుణ్య క్షేత్రంలో కన్నుల పండువగా జరగనున్న స్వామి బ్రహ్మత్సవాల్లో పాల్గొననున్నారు. ఆలయంలో బ్రహ్మోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఇందుకు నాందిగా గ్రామంలోని మహిళలు ఆలయ ఆవరణలో పసుపు కొమ్ములను రోకట్లో కొట్టి బ్రహ్మోత్సవాలకు శుభాన్ని అద్దారు. శైవాగమ పద్ధతిలో స్వర్ణ రుద్రాక్ష కంకణ, స్వర్ణ సింహతలాట సన్మాన గ్రహీత, రాష్ట్ర ఆదిశైవ అర్చక సంఘ అధ్యక్షుడు యనమండ్ర సత్యసీతారామ శర్మ ఆధ్వర్యంలో ఆలయ అర్చక స్వాముల, అధికారుల పర్యవేక్షణలో ఈ అయిదు రోజుల క్రతువుకు శ్రీకారం చుట్టారు. ఆలయంలో ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, స్వామి వారికి పంచామృత అభిషేకం, స్వామి, అమ్మవార్లను నూతన వధూవరులను చేసే కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పండితులు పంచామృతాలతో స్వామి వారికి, అమ్మవారికి స్నానాలు చేయించారు. బ్రహ్మోత్సవ కల్యాణ మూర్తులకు జంపన రామకృష్ణంరాజు దంపతులు అర్చకస్వాములకు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు అందజేశారు. సాయంత్రం ఆలయ ఆవరణలో అంకురారోపణ, అగ్ని ప్రతిష్ఠాపన, స్వామి వారిని, అమ్మవారిని భద్రపీఠంపై ఉంచి ప్రత్యేక అలంకరణలో గ్రామోత్సవాన్ని కన్నుల వైకుంఠంగా నిర్వహించారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా వీరేశ్వరుని కల్యాణం కన్నుల పండువగా జరిగింది. ఈ కల్యాణ మహోత్సవంలో ఎదురు సన్నాహం, ద్వాదశ ఆలయ ప్రదక్షిణ అనంతరం స్వామి, అమ్మవార్ల కల్యాణ మహోత్సవం కమనీయంగా సాగింది. ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు దంపతులు కార్యక్రమంలో పాల్గొన్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ఆలయ ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

టీడీపీ నేతల కవ్వింపు చర్యలు

- మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డిపై దాడికి యత్నం
- పెదపూడిలో కారును అడ్డగించడంతో ఉద్రిక్త పరిస్థితులు



పెదపూడిలో మాజీ ఎమ్మెల్యే కారును దౌర్జన్యంగా అడ్డుకుంటున్న టీడీపీ నాయకులు

పెదపూడి: గ్రామంలో టీడీపీ నాయకులు మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డిపై కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. గురువారం రాత్రి దోమాడ గ్రామం నుంచి అనపర్తి వెళుతున్న వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి కారును టీడీపీ నాయకులు అడ్డగించి దాడికి ప్రయత్నించారు. కొంతమంది కారు ముందు కూర్చుని కారును కదలనివ్వలేదు. మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి వెంట వైఎస్సార్ సీపీ నాయకులు రావడంతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో కొంత సమయం తరువాత తీవ్ర ఉద్రిక్తతల నడుమ మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి కారులో వెళ్లిపోయారు. మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి దోమాడ గ్రామంలో ఇళ్లు కోల్పోయిన బాధితులకు బియ్యం పంపిణీ చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడి అనపర్తి బయలు దేరారు. ఈలోపుగా మాజీ ఎమ్మెల్యేను అడ్డగించడానికి పెదపూడి మార్కెట్ సెంటర్‌లో టీడీపీ నాయకులు మోహరించారు. మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కారులో వస్తుండగా టీడీపీ నాయకులు అడ్డుకున్నారు. వెంటనే మాజీ ఎమ్మెల్యే కారులోంచి కిందకు దిగాలని పట్టుబట్టారు. ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, టీడీపీ నాయకులపై వ్యాఖ్యలు చేస్తున్నారంటూ కారుపై దాడికి పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో దోమాడ గ్రామంలో గృహాలు కోల్పోయిన బాధిత మహిళలు, నాయకులు, ప్రజలు ఒక్కసారిగా పెద్ద ఎత్తున మార్కెట్ సెంటర్‌కు చేరుకున్నారు. అక్కడ టీడీపీ, వైఎస్సార్ సీపీ నాయకుల మధ్య తోపులాట జరిగింది. కొంతసేపు ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలీసులు అక్కడకు చేరుకున్నారు. మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి కారులో వెళ్లిపోయారు. మాజీ ఎమ్మెల్యేకు దళిత, ప్రజా సంఘాల నాయకులు, దోమాడ గ్రామంలో ఇళ్లు కోల్పోయిన బాధితులు పెద్ద ఎత్తున అండగా నిలిచారు.

'రామకృష్ణారెడ్డి.. నీ హత్యా రాజకీయాలకు భయపడను'

'ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి.. నీ హత్యా రాజకీయాలకు నేను భయపడను' అని వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమాడ గ్రామంలో బాధితులకు సాయం చేసి వస్తే నీ టీడీపీ గూండాలు, రౌడీలను పంపించావా అని దుయ్యబట్టారు. ఖబడ్దార్ రామకృష్ణారెడ్డి.. ఎన్ని హత్యా ప్రయత్నాలు చేసినా నీ అవినీతి అక్రమాలను ఎండగడుతూనే ఉంటాను. నీ అక్రమాలపై ప్రశ్నిస్తూనే ఉంటాను. నాకు అండగా, రక్షణగా నిలిచిన దళిత ప్రజా సంఘాల నాయకులు కొండబాబు, ఆదినారాయణ, ఏనుగుపల్లి కృష్ణ, దోమాడ బాధితులు, పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని అన్నారు.